

31లోగా పనులు పూర్తి కావాలి...


సమీక్షలో పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క

మేడారం, జనవరి 17: మేడారం మహాజాతర అభివృద్ధి పనుల్లో పారదర్శకత లోపిస్తే సహించేది లేదని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. భక్తులకు వసతుల కల్పన, ఏర్పాట్లలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, అవినీతికి పాల్పడే అధికారులు ఇంటికి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నాసిరకం పనులు చేసే కాంట్రాక్టర్‌లను బ్లాక్‌లిస్టులో పెడుతామని తేల్చిచెప్పారు.

ములుగుజిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెలను మంత్రులు బుధవారం దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి మేడారం వచ్చిన సురేఖ... తన కూతురు, మనవడు, మనవరాలితో కలిసి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. తులాభారంలో ఎత్తుబంగారం(బెల్లం), చీర, గాజులు, పసుపు కుంకుమలను దేవతలకు సమర్పించారు.

ఈ సందర్భంగా అధికారులు, పూజారులు మంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు. జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు రూ.1.5 కోట్లతో నిర్మించ తలపెట్టిన పూజారుల భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన శానిటేషన్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు.

గరం గరంగా సమీక్ష

మేడారంలోని సమ్మక్క భవన్‌లో ఆయా శాఖల అధికారులతో మంత్రులు సురేఖ, సీతక్క సమావేశమయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, ఆయా శాఖల జిల్లా విభాగాధిపతులతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జనవరి 31 నాటికి పనులన్నీ పూర్తి కావాలన్నారు. రూ.75 కోట్ల నిధులతో సాధ్యమైనంత వరకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. కొందరు కాంట్రాక్టర్లు లెస్ టెండర్లు వేశారని, అలాగని నాణ్యత లోపిస్తే ఊరుకునేది లేదని అన్నారు. క్వాలిటీని పరిశీలించిన తర్వాతనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడే అధికారులు ఇంటికి పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్య పనులను నాణ్యతగా జరిపించాలన్నారు. జాతరకు 60 రోజుల ముందు ప్రభుత్వం ఏర్పాటైందని, అయినా భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

మేడారాన్ని నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ పాలనలో మేడారం జాతర నిర్లక్ష్యానికి గురైందని మంత్రి సీతక్క విమర్శించారు. రూ.200కోట్లతో 200 ఎకరాల్లో జాతరను అభివృద్ధి చేస్తామనే హామీని విస్మరించిన వారిని ప్రశ్నించకుండా, కొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారన్నారు. క్రితం జాతరలకు రూ.75కోట్ల వరకు కేటాయించిన గత పాలకులు నిధుల విడుదల, బిల్లుల చెల్లింపుల సమయంలో తగ్గించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన పదిరోజుల్లోనే రూ.75కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. భిన్నాభిప్రాయాలు లేకుండా భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. 'జాతరకు రూ. 200 కోట్లు కావాలని డిమాండ్ చేసిన సీతక్క.. మంత్రి అయిన తర్వాత ఆ మేరకు నిధులు ఎందుకు మంజూరు చేయించలేదని నాపై కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నేను ఏ సందర్భంలో మాట్లాడానో తెలుసుకోవాలి. హామీలిచ్చి విస్మరించింది బీఆర్ఎస్.. కానీ, ప్రభుత్వం వచ్చిన 10 రోజుల్లోనే రూ.75కోట్లు విడుదల చేశాం' అని సీతక్క అన్నారు. మరో రూ.30కోట్లు ఇచ్చేందుకు సీఎం, డిప్యూటీ సీఎం అంగీకరించారని తెలిపారు. కేంద్రమంత్రిగా కొనసాగుతున్న కిషన్‌రెడ్డి మేడారానికి జాతీయ హోదా కల్పించేందుకు సహకరించాలని కోరారు. మేడారం జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని వర్తింప చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, ఓఎస్డీ అశోక్ కుమార్, ఐటీడీఏ ఏపీవో వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మకు మొక్కులు

అంతకుముందు మేడారానికి వెళ్లే క్రమంలో ములుగు సమీపంలోని గట్టమ్మ వద్ద మంత్రులు సురేఖ, సీతక్క పూజలు జరిపారు. ఈ సందర్భంగా గట్టమ్మ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే 'ప్లాస్టిక్ కవర్ వద్దు..కాటన్ సంచి ముద్దు' అనే నినాదంతో కూడిన పోస్టర్‌ను, జ్యూట్ బ్యాగులను మంత్రులు మేడారంలో ఆవిష్కరించారు. జంపన్నవాగు వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను, మహిళలు బట్టలు మార్చుకునే గదులను ప్రారంభించారు.


వన దేవతలకు చీర, సారె సమర్పించేందుకు గద్దెల వద్దకు వస్తున్న మంత్రులు సీతక్క కొండా సురేఖ


వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క



- మేడారం మహా జాతర ఏర్పాట్లకు రూ.75 కోట్లు విడుదల చేశాం..
- మరో రూ.30 కోట్లు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు..
- పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకోం..
- అధికారులపై కఠిన చర్యలు, బ్లాక్ లిస్టులోకి కాంట్రాక్టర్లు
- మేడారం స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం
- ఏర్పాట్లపై సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- వన దేవతలకు ఘనంగా మొక్కులు
- మనవడితో కలిసి ఎత్తు బంగారం సమర్పించిన సురేఖ

పోటెత్తిన భక్తులు

వన దేవతల గద్దెల వద్ద భక్తుల రద్దీ

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మేడారానికి భక్తులు పోటెత్తారు. బుధవారం లక్ష మందికి పైగా జనం వనదేవతలను దర్శించుకున్నారు కొత్తూరు-మేడారం మధ్య కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. ములుగు ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసిన భక్తులు.. సమ్మక్క, సారలమ్మలను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో మేడారం పరిసరాల్లో విడిది చేసి విందు భోజనాలు చేశారు.

మళ్లీ వచ్చారు..

- మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన విజిలెన్స్ అధికారులు
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆరా
- డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలో తనిఖీలు
- కాళేశ్వరం హరిత హోటల్‌లో ఇంజనీర్లతో సమావేశం


మహదేవపూర్ మండలం కాళేశ్వరం హరితహోటల్ వద్ద విజిలెన్స్ డీజీ, అధికారులు, బ్యారేజీకి వస్తున్న విజిలెన్స్ అధికారులు

మహదేవపూర్ రూరల్, జనవరి 17: కాళేశ్వరం ప్రాజెక్టును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరోసారి సందర్శించడం చర్చనీయాంశమైంది. ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి చోటుచేసుకుందని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మహదేవపూర్ మండలంలో ఈనెల 9న ఎస్పీ రమేష్ నేతృత్వంలో ఈ బృందం పర్యటించింది. కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించింది. టిపారుదల శాఖ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైంది. కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకొని తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరింది. ఇలా మూడు రోజులపాటు ఈ తనిఖీలు కొనసాగాయి. తాజాగా బుధవారం కూడా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పర్యటించారు. మరోసారి విచారణను ప్రారంభించారు.

డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలో 20 మంది అధికారుల బృందం బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం చేరుకుంది. మధ్యాహ్నం 2 గంటలకు కాళేశ్వరం హరిత హోటల్ చేరుకున్న డీజీ రాజీవ్ రతన్, ఇతర అధికారులు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పలు అంశాలను సమీక్షించిన అనంతరం మేడిగడ్డ బ్యారేజీ వంతెన దెబ్బతిన్న ప్రాంతానికి చేరుకున్నారు. వంతెన కుంగుపాటుపై అక్కడున్న ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత బ్యారేజీ వంతెనపై నుంచే కుంగుబాటుకు గురైన పిల్లర్లను పరిశీలించారు. బ్యారేజీలో నీటి నిల్వలు లేకపోవడంతో మహారాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలోకి వెళ్లారు. దెబ్బతిన్న 20వ పిల్లరును విజిలెన్స్ అధికారులు స్వయంగా పరిశీలించినట్టు తెలిసింది. బ్యారేజీ పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్ కార్యాలయంలో అక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు 10 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. అనంతరం తిరిగి కాళేశ్వరం హరిత హోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు. రాత్రి మరోమారు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించినట్టు తెలిసింది. ఈ సమీక్షలకు మీడియాతోపాటు స్థానిక పోలీ సులను సైతం దూరంగా ఉంచారు.

వారం రోజుల్లోనే..

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎస్పీ రమేష్ నేతృత్వంలో ఈనెల 9న మేడిగడ్డను సందర్శించారు. మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి కీలక ఫైళ్లు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. వారం రోజులు కూడా గడవక ముందే మరోమారు డీజీ స్థాయి అధికారితో విచారణ ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం కేంద్రంగా ఈబృందం మరో రెండు రోజులపాటు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. ఇందుకు హరిత హోటల్‌లో మూడు రోజులకు రూములను ముందస్తుగా బుక్‌చేసినట్లు సమాచారం.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్


మండల సభలో మాట్లాడుతున్న జాటోత్ రాంచంద్రునాయక్

మరిపెడ, జనవరి 17 : అధికారులు, పాలకులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే.. ప్రజలు గుర్తిస్తారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు అధ్యక్షతన జరుగగా ఆయన హాజరై, వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షించారు. కోతుల బెడద, ఇతరాత్ర కారణాలతో రైతులు సరియైన దిగుబడులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులను ఉద్యానవన పంటలపై దృష్టి సారించేలా కృషి చేయాలన్నారు. ఎస్సారెస్పీ కెనాల్స్‌పై అవసరమైన చోట ఓటీలు (తూములు) ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జనవరి చివరి వరకు రైతులందరికీ రైతుబంధు తమ తమఖాతాలో జమ అవుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందేలా అధికారులు పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ తేజావత్ శారద రవీందర్, ప్రత్యేక ఆహ్వానితులుగా కుడితి మహేందర్ రెడ్డి, ఎంపీడీవో ధన్‌సింగ్, సీడీపీవో శిరీష, వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ శారద శాలువతో సత్కరించారు. కాగా, జర్నలిస్టులు, పంచాయతీ కార్యదర్శులు వారివారి డిమాండ్లపై వినతి పత్రం అందించారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు..

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం డిగ్రీ పూర్తయిన యువత ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పట్టభద్రులను కలువాలన్నారు. ఊరూరికి రూ.5 లక్షలు అభివృద్ధి నిధులు ఇవ్వడం జరుగుతుందని, అత్యవసర పనులను గుర్తించి ఎస్టీమెంట్ తయారు చేసుకోవాలని కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్ రెడ్డి, మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, తాజుద్దీన్, గుగులోత్ రవి, ఐలిమల్లు, లక్ష్మారెడ్డి, కొండం దశరథం, గుండగాని వెంకన్న,డాక్టర్ రాకేశ్, వీరభద్రం, వెంకటసాయి, సురేశ్, బోర గంగయ్య పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈనెల 26వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భావం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీస్ గౌరవవందనం, పరేడ్‌ను పోలీస్‌శాఖ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను మునిసిపల్ కమిషనర్, వేదిక అలంకరణను ఉద్యానవన శాఖ అధికారి చేపట్టాలని చెప్పారు. ముఖ్యఅతిథులకు ఆహ్వానపత్రాలందించడం, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ సభా నిర్వహణను చేపట్టాలని మానుకోట ఆర్డీవోకు తెలిపారు. జిల్లా ప్రగతిపై రూపొందించే కాపీ ఏర్పాట్లను సీపీవో, డీపీఆర్వో చూడాలన్నారు. ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. జాతీయ భావం పట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాన్ని సిద్ధంగా ఉంచాలని ఫైర్ ఆఫీసర్‌ను ఆదేశించారు. వేడుకల ను నిర్వహించే స్థలాన్ని అధికారులు సందర్శించి, ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, సూర్యనారాయణ, నరేష్, రామారావు, సుబ్బారావు, ప్రసన్నారాణి పాల్గొన్నారు.

ఉచిత కరెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్

తొర్రూరు, జనవరి 17 : ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందిస్తున్న 101 యూనిట్ల ఉచిత కరెంట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ జి.మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తొర్రూరు డివిజన్ పరిధిలోని చిన్నవంగర, పెద్దవంగర, నెల్లికుదురు, మునిగలవీడు, దంతాలపల్లి, నర్సింహులపేట, మరిపెడ, తొర్రూరు, ఎల్లంపేట, చిన్నగూడూరు సబ్‌స్టేషన్ల పరిధిలో 4,614 ఎస్సీ కుటుంబాలు ఉచిత 101 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకుంటున్నాయని, మరో 1,986 కుటుంబాలు ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పై సబ్‌స్టేషన్ల పరిధిలో ఎస్టీ కుటుంబాలు 9,273 కుటుంబాలు 101 యూనిట్ల విద్యుత్‌ను వినియోగంచుకుంటున్నాయని, మరో 4,911 కుటుంబాలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న 101 యూనిట్ల ఉచిత విద్యుత్ సేవలు ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, అర్హత గల కుటుంబాలు కుల ధ్రువీకరణ పత్రాలతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆయా మండలాల రెవెన్యూ ఇతర శాఖల అధికారులు ఉచిత విద్యుత్ సేవలపై అవగాహన కల్పించాలన్నారు.

గర్భిణీల వివరాలను నమోదు చేయాలి


మల్యాల పీహెచ్‌సీలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో అంబరీష

నెహ్రూసెంటర్, జనవరి 17 : గర్భిణీల వివరాలను 12 వారాల్లోగా నమోదు చేయాలని జిల్లా వైద్య, వైద్యాధికారి అంబరీష వైద్యులకు సూచించారు. మహబూబాబాద్ మండలం మల్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల పేర్లను నమోదు చేశాక మొదటి రెండు చెకప్‌లను పీహెచ్‌సీలో, 3, 4 చెకప్‌లు ఏరియా ఆస్పత్రిలో నిర్వహించాలన్నారు. స్త్రీ వైద్య నిపుణులు స్కానింగ్ నిర్వహించి గర్భిణీలకు తగిన మందులు ఇవ్వాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, క్యాన్సర్‌లను 30 సంవత్సరాల పైబడిన వారందరికి పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించాలన్నారు. కీటకజనిత వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా రాకుం డా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణార్జునరావు, వడ్డెబోయిన శ్రీనివాస్, రుక్మిద్దీన్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మేలు

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ


ఆయిల్ పామ్ పంటలను పరిశీలిస్తున్న సూర్యనారాయణ

తొర్రూరు రూరల్, జనవరి 17 : ఆయిల్ పామ్ సాగుతోనే రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. బుధవారం హరిపిరాల గ్రామ శివారులో సాగు చేసిన పంటను సందర్శించి, మాట్లాడారు. దేశంలో అధికంగా డిమాండ్ ఉన్నపంట ఆయిల్ పామ్ సాగన్నారు. రాష్ట్రంలో పంట విస్తరణకు ఆయిల్ ఫెడ్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రతీ రైతు నష్టాలను అధిగమించి, లాభాలు గడించడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. గోపాలగిరిలో ఆయిల్ పామ్ పరిశ్రమను పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, అధికారి రాకేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

తొర్రూరు, జనవరి 17 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి.జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 'ఆన్‌లైన్' దరఖాస్తుల కోసం ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించిందని, 4వ తరగతి చదవుతున్న విద్యార్థులు గురుకులాల 'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

అంతా రామమయం


మానుకోటలో జైశ్రీరాం అంటూ స్టిక్కర్ వేస్తున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్య

- జిల్లాలో మార్మోగుతున్న శ్రీరామ నామస్మరణం
- పల్లెలు, పట్టణాల్లో ఇంటింటికి అక్షింతల వితరణ
- జైశ్రీరాం అంటూ గోడలకు స్టిక్కర్లు, కరచాలనాలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 : జిల్లా అంతా రామయంగా మారింది. మారుమూల పల్లెల నుంచి పట్టణాల వరకు శ్రీరామ నామస్మరణతో మార్మోగుతోంది. ఈనెల 22వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీరాముడి జన్మస్థలం అయోధ్యలో శ్రీరామమందిరం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా శ్రీరామనామ జపం చేస్తున్నారు. అయోధ్యలో పెద్దఎత్తున శ్రీరామందిరం ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు చేస్తుండగా, ఆదేరోజు ప్రతీ ఇంటిలో దీపాలు వెలిగించి, ముందస్తుగా దీపావళి పండుగను జరుపుకోవాలని పిలుపునందుకున్న భక్తజనం అందుకు సిద్ధమవుతున్నారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాములోరి అక్షింతలు జిల్లాలోని అన్నిగ్రామాలు, మునిసిపాలిటీలోని వార్డుల్లో బాధ్యతగా ఇంటింటికి తిరిగి పంపిణీ చేసి, శ్రీరామమందిర ప్రాణప్రతిష్ఠ విశిష్టతను వివరిస్తున్నారు. గత 15 రోజులుగా వితరణ కొనసాగుతోంది. ప్రజలంతా భాగస్వాములై అక్షింతలు పంపిణీ చేస్తుండగా, మరోపక్క ప్రతీ ఒక్కరు తమతమ ఇళ్ల గోడలకు జైశ్రీరాం అంటూ స్టిక్కర్లు వేసుకుంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీరాముడు, జైశ్రీరాం, అయోధ్య అంటూ ముగ్గులు వేసి శ్రీరాముడిపై ఉన్నభక్తిని చాటుకున్నారు. సంక్రాంతి రోజున ప్రతీ ఇంటిఎదుట వేసిన ముగ్గుల్లో శ్రీరామనామస్మరణం కన్పించింది. అంతేకాకుండా గతంలో ఫోన్‌లు వచ్చిన సమయంలో హాలో అంటూ పలికిన గొంతులు ఇప్పుడు జైశ్రీరాం అంటూ పలకరించుకుంటున్నారు. దీనికి తోడు ఇద్దరు స్నేహితులు, బంధువులు కలిసిన సమయంలో కూడా జైశ్రీరాం అంటూ కరచాలనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మికత సంతరించుకుంది. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠలో భాగస్వాములు కావడం తమ పూర్వజన్మ సుకృతంలా ప్రజలంతా భావిస్తున్నారు.



మానుకోటలో రాములోరి అక్షింతలు పంపిణీ చేస్తున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కేయూ రోడ్డులో ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

హనుమకొండ క్రైం, జనవరి 17: హనుమకొండ కేయూ రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తిని మరోవ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో బిళ్ల అమరప్రసాద్‌రెడ్డి(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేయూ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం..



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అమరప్రసాద్‌రెడ్డి

హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన అమరప్రసాద్ రెడ్డి వ్యక్తిగత పనిమీద బుధవారం హనుమకొండకు వచ్చాడు. పని ముగించుకుని సాయంత్రం 7గంటల సమయానికి కేయూ రోడ్డులోని ఫస్ట్‌గేటు ముందు గల డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుని డబ్బాల వైపు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో రాంగ్ సైడ్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న భూక్యా జయంత్ అనే వ్యక్తి బైక్‌పై అజాగ్రత్తగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో అమరప్రసాద్‌రెడ్డి కింద పడిపోయాడు. తల నేలకు తగలడంతో తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. వెంటనే అక్కడి వారు చూసి బతికించే ప్రయత్నం చేశారు. 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి చూసి మృతి చెందినట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన యువకుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు వెల్‌నెస్ సెంటర్

కాళోజీ జంక్షన్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉచిత వైద్య చికిత్సల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. గురువారం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను ఎంపిక చేయడానికి సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య నగరానికి రానున్నారు. ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నందున సెంటర్ ఏర్పాటు విషయంలో అధికారులకు సహకరిస్తామని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం, జిల్లా గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జె. ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.

మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు

వడ్డెపల్లి, జనవరి 17: మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి నుంచి 8వ తరగతి, ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 7993357105లో సంప్రదించాలన్నారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్త్‌కు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించినన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సోహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్నసాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజిత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహణి ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో నందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన బీజేపీ నేతలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 17 : కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్‌ను బుధవారం బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీపాటిల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, గడ్డం అశోక్, సుధీర్‌రెడ్డి, రాంబాబు, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, నరేష్, సుధాకర్, కోటి, మోదిన్‌నాయక్, వినయ్ పాల్గొన్నారు.



ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్‌ను శాలువాతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



మహబూబాబాద్‌లో ఐదు తరాలతో వజ్రమ్మ

ఐదోతరం ఆనందం..

- మనవరాలును చూసి మురిసిన వజ్రమ్మ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 17 : జిల్లా కేంద్రానికి చెందిన తూనం వజ్రమ్మ ఐదోతరం మనవరాలును చూసి ఆనందంతో మురిసిపోయింది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మునిమనవరాలు దొంతు హారిక బుధవారం పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో వజ్రమ్మ ఐదోతరం వారసురాలిని చూసి, ఎంతగానో సంతోషపడుతోంది. కాగా, వజ్రమ్మ వయస్సు (88) ఆమెకు ఐదుగురు కుమార్తెలు సంతానం. వజ్రమ్మ కూతురు సంకటాల యాకమ్మ (60), యాకమ్మ కూతురు అల్లంశెట్టి మాధవి (42), మాధవి కూతురు దొంతు హారిక (23), హారిక కూతురు దొంతు కీర్తనకు పండంటి శిశువుకు జన్మనిచ్చి 21 రోజులైంది. దీంతో ఐదోతరం మనవరాలుని చూసిన వజ్రమ్మ సంతోషంలో మునిగిపోయింది. ఇలాంటి ఘటనలు అరుదుగా కన్పిస్తాయి.

ద్విచక్ర వాహనం ఢీకొని.. ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి17 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్కె. మహిమూద్‌పాష జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలో కూతురు నూతన గృహ ప్రవేశానికి వెళ్లారు. ఫంక్షన్ పూర్తయ్యాక బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సులో మహబూబాబాద్‌కు చేరుకున్నారు. ఇందిరాగాంధీ సెంటర్‌లో చిల్లర కోసం రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఆయన్ను ఢీకొట్టడంతో తలకు గాయంతో పాటు, కాలువిరిగిపోయింది. అతన్ని స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహిమూద్‌పాష కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

కేసముద్రం, జనవరి 17 : కేసముద్రం విలేజి సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరంగల్ రామన్నపేటకు చెందిన సంద్రగిరి బాలరాజు(55) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. మూలమలుపు వద్ద లారీ, మోటార్ సైకిల్ ఢీకొని బాలరాజు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈ క్రమంలో తొలుత అయన్ను 108లో జిల్లా ఆస్పత్రికి అక్కన్నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున ఎంజీఎంలో మృతి చెందాడు. మోటార్ సైకిల్‌పై చేపలు విక్రయించే అయనకు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఆకేరువాగులో పడి వ్యక్తి మృతి

నెల్లికుదురు, జనవరి 17 : చేపల వేటకు వెళ్లి ఓవ్యక్తి ఆకేరు వాగులో పడి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై యాకయ్య కథనం ప్రకారం. నెల్లికుదురు మండలకేంద్రానికి చెందిన గుండగాని ఐలయ్య (50) తన భార్య యాకమ్మ, బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరులేని సమయంలో ఐలయ్య ఈనెల 15న ఆకేరు వాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాతు వాగులో పడి మృతి చెందాడు. బుధవారం పశువుల కాపరులు ఆకేరువాగులో చూడగా ఐలయ్య మృతదేహం కనిపించింది. పశువుల కాపరులు వెంటనే ఐలయ్య కుటుంబసభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య యాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఏఎస్సై యాకయ్య పేర్కొన్నాడు.

నలుగురిపై వరకట్నం కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జనవరి 17 : మంచిర్యాల జిల్లాకు చెందిన నలుగురిపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై రామారావు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రం గోగుల మల్లయ్య వీధికి చెందిన మదిర రోజాను నాలుగేళ్ల క్రితం మంచిర్యాల జిల్లాకు చెందిన మదిర నాగ మహేష్‌బాబుతో వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ. 20 లక్షల నగదుతో పాటు కట్న కానుకలను ఇచ్చారు. వివాహమైన ఏడాది తర్వాత వారికి కుమార్తె సంతానం. అప్పటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త మదిర నాగమహేష్‌బాబు, మామ వెంకటేశ్వరరావు, అత్త సుజాత, ఆడపడుచు దివ్య కలిసి తనను మానసికంగా హింసిస్తున్నారని చెప్పారు. గత మూడు నెలల క్రితం భర్త నాగమహేష్‌బాబు ఇంట్లో నుంచి వెళ్లగొట్టడంతో తల్లిగారి ఊరైన మహబూబాబాద్‌కు వచ్చి ఉంటున్నారని, తనను హింసించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. బాధితురాలు రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

తిరుగు ప్రయాణం

- సంక్రాంతి సెలవులు ముగియడంతో పట్టణాలకు జనం

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 : సంక్రాంతి పండుగ ముగిసింది... విద్యాశాఖ ప్రకటించిన సెలవులు పూర్తవడంతో జనం పట్టణాలకు తరలిపోతున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులుండడంతో మూడు రోజుల పండుగను ఘనంగా జరుపుకునేందుకు పట్టణాల నుంచి తమతమ సొంతూళ్లకు పెద్ద ఎత్తున వచ్చారు. 13 రెండవ శనివారం ఉండంతో పండుగకు ఒక్క రోజు ముందుగానే పట్టణాల్లో ఉంటున్న ఉద్యోగులు సైతం గ్రామాలకు చేరుకున్నారు. బోగి, సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా జరుపుకున్న వారంతా ఈ నెల 17తో పాఠశాలకు ప్రకటించిన సెలవులు ముగుస్తుండడంతో తమ కుటుంబ సభ్యులతో కలిసి పట్టణాలకు బయలు దేరారు. 18న ఉదయమే పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి ఉండగా బుధవారం సాయంత్రం వరకే తమ తమ ఇళ్లకు చేరుకున్నారు. తిరుగు ప్రయాణంతో మళ్లీ ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిటకిట లాడాయి. ఇక పండుగ కోసం వచ్చిన వారంతా పల్లెల నుంచి పట్టణాలకు తరలిపోవడంతో



మానుకోట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు

గ్రామాలుఖాళీ అయ్యాయి. ఐదు రోజుల పాటు బంధుమిత్రులతో సందడిగా ఉన్న పల్లెలు బోసి పోయినట్లు కన్పించాయి.

సంక్రాంతికి ఆర్టీసీ ఆదాయం రూ.95 లక్షలు

తొర్రూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి వివిధ రూట్లలో బస్సులు నడపగా అత్యధిక ఆదాయం లభించినట్లు ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రజిత తెలిపారు. డిపో పరిధిలో 93 బస్సులు ఉండగా



తొర్రూరు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు రూ.95 లక్షల 17వేలు ఆదాయం వచ్చిందని, 15వ తేదీ రూ.9 లక్షలు, 16వ తేదీ రూ.24 లక్షల 34వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించడం ద్వారా సంక్రాంతి పండుగకు డిపోకు సుమారుగా రూ.25 లక్షల అదనపు ఆదాయం సమకూరిందన్నారు. గతంలో డిపో ఆదాయం రూ.9 లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఉందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించనప్పటి నుంచి రూ.5 లక్షల ఆదాయం పెరిగిందని తెలిపారు. డిపో పరిధిలో అత్యధిక సర్వీసు హైదరాబాద్ రూట్‌లోనే నడపడం జరిగిందన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌లోని ఉప్పల్ డిపో నుంచి తొర్రూరుకు మరో 88 సర్వీసులు నడవగా, ఆదాయం డిపోకు లభించిందన్నారు.

సీతారాముల స్వామి దేవాలయంలో చోరీ

మరిపెడ రూరల్, జనవరి 17 : గుండెపుడిలోని శ్రీసీతారాములు స్వామి దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు సుమారు రూ. 4లక్షల విలువైన గరుడ, శేషవాహనాలు,ఆంజనేయస్వామి విగ్రహం, బంగారు పూతతో చేసిన నాణెలు దొంగతనం చేశారు. స్థానికులు, పూజారి సముద్రాల లక్ష్మీనర్సింహాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం. గుడి వెనుకవైపు పరంజా (నిచ్చెన) నుంచి దొంగలు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయానికి వేసినతాళాలను పగులకొట్టారు. గరుడ, శేష వాహనాలు, ఆంజనేయ స్వామి విగ్రహాలతోపాటు బంగారు పూతతో చేసిన నాణెలను దోచుకువెళ్లారు. బుధవారం ఉదయం దేవాలయానికి పూజ చేసేందుకు పూజారి రాగా, ఈ విషయం తెలిసింది. వెంటనే సీఐ రాజుకు ఈ విషయం తెలిపారు. స్పందించిన సీఐ క్లూస్ టీంను రప్పించి, ఆధారాలను సేకరించారు. కాగా, ఇలాంటి దొంగతనాలు అంతరాష్ట్ర దొంగల పనేనని, గతంలో కూడా రెండు పర్యాయాలు చోరీ జరిగినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన వారిని వీలైనంత త్వరగా పట్టుకుంటామని తెలిపారు.



గుండెపుడి సీతారాముల దేవాలయం

సత్యతండాలో యువతి అదృశ్యం

డోర్నకల్ జనవరి 17 : మండలంలోని ఉయ్యాలవాడ శివారు సత్యతండాకు చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. సత్యతండాకు చెందిన యువతి (19) ఈనెల 15వ తేదీన అర్ధరాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సదరు యువతి ఆచూకి కోసం బంధువులు స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం రాత్రి యువతి తండ్రి మాన్‌సింగ్ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మైనార్టీ స్కూల్‌ను తనిఖీ చేసిన చైర్మన్, కమిషనర్

డోర్నకల్ జనవరి 17 : డోర్నకల్‌లోని మైనార్టీ బాలికల పాఠశాలను బుధవారం మునిసిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ మున్వర్ అలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం డోర్నకల్‌కు వచ్చిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్‌ను మైనార్టీ నాయకులు కలిసి పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలకు వెళ్లే దారికి కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించాలని విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చైర్మన్, కమిషనర్, పాఠశాలను తనిఖీ చేశారు. మునిసిపల్ ఏఈ బాబును కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణం కోసం కావల్సిన అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

జగన్నాథం ఆశయాలను కొనసాగించాలి

నెల్లికుదురు, జనవరి 17 : పేదల కోసం జీవితాన్ని త్యాగంచేసిన పెరమాండ్ల జగన్నాథం ఆశయాలను కొనసాగించాలని డాక్టర్ జోత్స్నప్రియ తెలిపారు. నైనాలలో జగన్నాథం యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, ఎడ్ల బండ్లపోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పెరమాండ్ల తిలక్‌బాబు, జగన్, యాదగిరి, రామరాజు, సమ్మయ్య నర్సయ్య, యాకయ్య, సునిల్, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

కేసముద్రం, జనవరి 17 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి పార్టీలో విధేయునిగా ఉంటూ పార్టీ గెలుపుకోసం అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. మార్కెట్ చైర్మన్‌గా పార్టీలో కష్టపడిన కేసముద్రం మండలం వారికే ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు మండల నాయకులు అయూబ్‌ఖాన్, తరాల వీరేష్‌యాదవ్, గండి శ్రీనివాస్, గంధసిరి శ్రవణ్, చిట్ల సంపత్, గొల్లపెల్లి మహేందర్, కీర్తి సురేందర్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, ఐత సారయ్య, గుగులోత్ రాము పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

'ఎంపీగా పోటీచేసే అవకాశం ఇవ్వాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎంపికలో తనకు మద్దతునివ్వాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన సింగరేణి వైద్యుడు నూనావత్ శంకర్‌నాయక్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఉద్యమాల్లో ఉంటూ సింగరేణి ఆల్ ట్రైబ్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్‌గా, ఐఎన్‌టీయూసీ సింగరేణి కోల్‌మైన్స్ తెలంగాణ స్టేట్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా, జీఈఎం మెడికల్ హాస్పటల్స్ డైరెక్టర్‌గా పని చేసిన తనకు ఈసారి ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. తనకు అవకాశం ఇస్తే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని సాధించడంతో పాటు బయ్యారం చెరువుకు సీతారామ ప్రాజెక్టు నీళ్లను తీసుకువస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులతో మానుకోట ఎంపీగా బరిలో నిలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

కేసముద్రం, జనవరి17 : నామినేటెడ్ పోస్టుల్లో పార్టీలో కష్టపడిన వారికి అవకాశం కల్పించాలని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్ కోరారు. హైదరాబాద్‌లో బుధవారం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపక్ మున్షీని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

గార్ల, రాంపురం బ్రిడ్జికి నిధులు కేటాయించాలి

గార్ల, జనవరి 17 : రాంపురం వద్ద పాకాల ఏటిపై హైలేవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరుతూ టీపీసీసీ మాజీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య నేతృత్వంలో బుధవారం మరిపెడలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచదర్‌నాయక్‌ను కలిసి విన్నవించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న పాకాల ఏటిపై చెక్‌డ్యామ్‌తో పాటు జీవంచిపల్లి నుంచి డోర్నకల్ మండలంలోని దుబ్బతండా వరకు రోడున్ను నిర్మిస్తే గార్ల, డోర్నకల్ మండలాల మధ్య మార్గం సుగుమం అవుతుందని ఆయన వివరించారు. పెండింగ్ సమస్యలపై నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రావూరి మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

'విద్యావంతులు సద్వినియోగం చేసుకోవాలి'



గ్రంథాలయం ప్రారంభిస్తున్న సర్పంచ్ మమత

తొర్రూరు రూరల్, జనవరి 17 : గ్రామంలోని నిరుద్యోగ యువతీ, యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రావుల మమతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హరిపిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో చదువుకునే యువతకు ఉన్నత విద్యకు, ఉద్యోగాల కోసం ప్రిపరేషన్ కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, ఎంపీటీసీ గోపమ్మ, పంచాయతీ కార్యదర్శి దేవయ్య, వార్డు సభ్యులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన కాంగ్రెస్ నాయకులు..

హరిపిరాల గ్రామంలో సర్పంచ్ రావుల మమత అధ్యక్షతన గ్రంథాలయం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సవం శిలాఫలకాలను కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ధ్వంసం చేశారు. ఈ మేరకు సర్పంచ్ మమత, ఉపసర్పంచ్ రాజు, జీపీ పాలకవర్గం తొర్రూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

కురవిలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కురవి. జనవరి 17 : కురవి జడ్పీహెచ్ఎస్‌లో 2007-08 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు బుధవారం పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు గుమ్మళ్ల సురేందర్, లచ్చిరాం నాయక్, స్వామి, రమేష్‌చంద్ర, బాలాజీ, సైదులు రెడ్డి. విశ్వేశ్వర్, వెంకటేశ్వర్లను ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులు మేడి ప్రశాంత్, సుంకరి శ్రీకాంత్, గడీల రంజిత్, సింధువర్మ, నాగరాజు, అప్పాల రాజేందర్, కోర్ని నరేష్, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 17 : ఖమ్మంలో ఫిబ్రవరి 11. 12 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీ య విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం-2020 ప్రైవేటీకరణను బలో పేతం చేస్తూ ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికతత్వం. ఫెడరలిజం లాంటి రాజ్యాంగ లక్షణాలకు తిలోదకాలిచ్చే విధంగా ఉందన్నారు. విద్యను ఉమ్మడి జాబితాలోంచి తొలగిస్తూ కేంద్రం ఆధీనంలోకి తీసుకునే కుట్రజరుగుతోందన్నారు. ఉపాధ్యాయుల కామన్ సర్వీస్ రూల్స్, పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్, సీపీఎస్ విధానం రద్దు, 317జీవో బాధితుల సమస్యలు కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల మొదలగు సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుంచు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, బొల్లం శ్రీనివాస్, ఉప్పలయ్య, విష్ణువర్ధన్, చీకటి ఉపేందర్, సాంబయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతోనే పారదర్శకంగా ఉపాధి పనులు

- అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి



ప్రజావేదికలో మాట్లాడుతున్న శాంతకుమారి

కురవి, జనవరి 17 : సామాజిక తనిఖీలతోనే ఉపాధిహామీ పథకంలో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి అన్నారు. కురవిలోబుధవారం సామాజిక తనిఖీ 14వ విడత ప్రజావేదికను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. డిసెంబరు 2020 నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులపై చేసిన ఖర్చు, కూలీలకు వేతనాలు అందాయా.! లేదా? పనులు జరిగాయా! లేదా? తనిఖీ చేసి, ఏమైనా లోటుపాట్లు, తప్పిదాలు జరిగినట్లయితే ప్రజానివేదికలో తనిఖీ బృందం నివేదించింది. మండలంలో గత మూడేళ్లలో రూ.20.28 కోట్లకు పైగా పనులు ఉపాధిహామీ ద్వారా చేపట్టారు. మండలంలోని 48 గ్రామాల్లో పల్లెప్రగతి, ఇతర మెటీరియల్ పనులపై తనిఖీలు నిర్వహించారు. తొలిరోజు బుధవారం 16 గ్రామాల ప్రజావేదికపై ఆడిట్ బృందం తప్పులను అడిషనల్ డీఆర్డీవో ముందు ఉంచారు. తప్పు జరిగిన చోట ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లను మందలించిన అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి జరిమానాలు విధించి, కొన్నిచోట్ల రికవరీకి ఆదేశించారు. సెప్టెంబరు నెలలో వాటర్ ట్యాంకర్ల పేమెంట్ చేశారని, ఎస్సార్పీలు గుర్తించగా, సిబ్బంది సమాధానం ఇస్తూ చనిపోయిన మొక్కల స్థానంలో మొక్కలు నాటామని వర్షాలు రానందున వాటర్ ట్యాంకర్‌తో నీళ్లుపోసి, పేమెంట్‌లు గ్రామ పంచాయతీలకు చెల్లించామని వెల్లడించారు. ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో సరస్వతి, డీఆర్పీ యాకూబ్, ఎస్సార్పీ సురేందర్‌బాబు, ఏపీవో పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా), జనవరి 17 : మండలంలోని యామన్‌పల్లిలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఓ మెడికల్ షాపు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై సుధాకర్ తన సిబ్బందితో బుధవారం తనిఖీలు చేపట్టా రు. మహారాష్ట్రలోని పెంటిపాక గ్రామానికి చెందిన దుర్గం మిలింద్, దుర్గం సతీష్ నుంచి 980 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

షాహిన్ సుల్తానాకు డేటాఎంట్రీ ఆపరేటర్‌గా నియామక పత్రం అందజేత

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 17 : మహబూబాబాద్ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 11న 'నిబంధనలు తూచ్.. అనర్హులకు బోధనేతర సిబ్బంది నియామకం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మైనార్టీ శాఖ లో నిబంధనలతో తుంగలోతొక్కి. మెరిట్ అభ్యర్థులను విస్మరించి అనర్హులను డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా నియమించడపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని మైనార్టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ విచారణ అధికారిగా నియమించి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ క్రమంలో డోర్నకల్ మైనార్టీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మైనార్టీ జిల్లా అధికారి శ్రీనివాసరావు నిబంధనలకు విరుద్ధంగా నియమించిన డేటా ఎం ట్రీ ఆపరేటర్‌ను తొలగించి మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన అభ్యర్థిని షాహిన్ సుల్తానాకు బుధవారం జిల్లా మైనార్టీ శాఖ కార్యాలయంలో సూపరిండెంట్ నియామక పత్రాన్ని అందించారు.ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించడంతో అర్హులకు న్యా యం జరిగి మెరిట్ అభ్యర్థినీ షాహిన్ సుల్తానాకు నియామక పత్రాన్ని అందించారు. దీంతో ఆమె 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రాన్ని చూపుతున్న షాహిన్ సుల్తానా

సభను విజయవంతం చేయండి

- సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పిలుపు

గంగారం, జనవరి 17 : ఖమ్మంలో మార్చి 3న జరిగే విప్లవ పార్టీల పునరేకికరణ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గంగారంలో మండల కార్యదర్శి పూనెం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళితులు, గిరిజనులు బడుగు బలహీన వర్గాల ప్రజలు పెట్టుబడి వర్గాల నుంచి దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. సామ్రాజ్యవాదులు పాలక వర్గాలతో కుమ్మక్కై సాగిస్తున్న దోపిడీని తిప్పికొట్టేందుకు విప్లవ పార్టీలు అంతా ఒకటై నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యం, జోగ రాములు, వీరస్వామీ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

'గొల్లకుర్మలకు గొర్రెలను పంపిణీ చేయాలి'

గార్ల జనవరి 17 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డీడీ కట్టిన గొల్లకుర్మలకు కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా నాయకురాలు సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తం గా గత ప్రభుత్వం హయాంలో అధికార పార్టీ నాయకులు, అధికారుల మాటలు నమ్మి వందలాదిమంది పేద గొల్లకుర్మ లు రూ.38 వేలు అప్పులు చేసి కలెక్టర్ పేర డీడీలు తీయ డం జరిగిందన్నారు. గత ప్రభుత్వం మారిపోవడంతో గొల్ల కుర్మలు ఇక గొర్రెలురావని నిరాశతో కుమిగిలిపోతూ అప్పుల భారం పెరిగిపోతున్నాయని అన్నారు. వెంటనే వారికి గొర్రెలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులు అరెస్టు

పెద్దవంగర, జనవరి 17 : యువకుడిపై దాడిచేసి, గాయపర్చిన నలుగురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు. బుధవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన తుమ్మ దీపక్‌రెడ్డి సంక్రాంతి పండుగ సందర్భంగా తన అత్తగారి ఇల్లు అయిన పెద్దవంగర మండలం కొరిపల్లి గ్రామానికి రాగా, సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయి కుమార్, మహేష్, సాకి రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులతో, కర్రలతో తుమ్మ దీపక్ రెడ్డిపై దాడిచేసి, గాయపరిచారు. బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు పారిపోతుండగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.